క్లుప్తంగా

40 మంది రక్తదానం



మాజీ ఎమ్మెల్యే వాసుపల్లిని సన్మానిస్తున్న దశమంతుల చిన్ని తదితరులు

మహారాణిపేట: టౌన్ కొత్తరోడ్డు ఏరియాలో గల మధు జిమ్ ఇనిస్టిట్యూట్ నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మెగా రక్తదానం నిర్వహించారు. జిమ్‌లో శిక్షణ పొందుతున్న దాదాపు 40 మంది పాల్గొని తమ సేవానిరతి చాటుకున్నారు. నిర్వాహకుడు మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ హాజరై రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. చత్రపతి శివాజీ స్వచ్ఛంద రక్తదాన సంస్థ ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు క్లబ్ నిర్వాహకుడు మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దశమంతుల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలి



దీక్షలో పాల్గొన్న డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న 1455వ రోజు రిలే నిరాహార దీక్షకు సంఘీభావంగా డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నేవల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆదివారం దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరి విడనాడాలన్నారు. ఎంతో మంది ప్రాణాల బలిదానంతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించి, ప్లాంట్‌ను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేవల్ సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ జి. అరుణ్‌కుమార్, భానోజీ బిల్లా, సుదర్శన్, మోహన్, కో ఆపరేటివ్ సెక్రటరీ వై. రాజేష్, మీసాల సురేష్, నాగన్న దొర, చిరంజీవి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హాస్యామృతం



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: హాస్యప్రియ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో హాస్యామృతం పేరిట ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ ఆహూతులను కడుపుబ్బా నవ్వించాయి. క్లబ్ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, కార్యదర్శి ఇమంది ఈశ్వరరావు ఆధ్వర్యంలో కళాకారులు పి.కె.దుర్గారావు, అల్లాడ నాగరాజు, సీహెచ్ నాగార్జున, పి.ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రమేష్, వీరేంద్ర, రమ, సీత, ప్రావీణ్య, మల్లిక, పుష్యమి ప్రదర్శించిన స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. వీటిలో పాత పాట, ఆటగాళ్ళు, మామ అల్లుళ్లు, కష్టం, చెప్పులషాపు, అసూయ, స్త్రీ స్కిట్స్ అలరించాయి.

శంకరమఠంలో విశేష పూజలు



చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సీతంపేట: భాస్కర ప్రకాష ఆశ్రమం (చెన్నై) ఆధ్వర్యంలో రెండు రోజులుగా శంకర మఠంలో నిర్వహిస్తున్న విశేష పూజా కార్యక్రమాలు ఆదివారం ముగిసాయి. ఉదయం పండితుల వేదమంత్రాల మధ్య చండీ హోమం, విద్యా హోమం నిర్వహించారు. పూర్ణాహుతిలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సువాసిని పూజ, కన్య పూజ, వటుక పూజ, దంపతి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు, పూజల్లో పాల్గొన్న వారికి మహా అన్నప్రసాద వితరణ చేశారు.

ప్రమాదకరం.. చర్యలు శూన్యం



చావులమదుం జంక్షన్ వద్ద మూత లేని ఫ్యూజ్ బాక్స్‌తో ట్రాన్స్‌ఫార్మర్



అచ్చియ్యమ్మపేట అంబేద్కర్ కాలనీలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్, చేతులకు అందుతున్న ఫ్యూజ్ బాక్స్



దిడ్డి జగన్నాయకులు కల్యాణ మండపం వద్ద..



మున్సిపల్ కాలనీలో రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- భీతిగొల్పుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- జీవీఎంసీ 32,33,34 వార్డుల్లో పలుచోట్ల ఇదే పరిస్థితి
- కంచెలు లేకుండా.. పిల్లలకి కూడా అందే ఎత్తులో ఫ్యూజ్ బాక్స్‌లతో అధ్వాన నిర్వహణ



వాడబలిజ సంక్షేమ సేవా సంఘం వద్ద..

అల్లిపురం: జీవీఎంసీ 32,33,34 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అల్లిపురం పరిధి కొబ్బరితోట, ఎస్‌వీపీ నగర్, భూపేష్‌నగర్, చావులమదుం, నేరెళ్లకోనేరు, అచ్చియ్యమ్మపేట తదితర ప్రాంతాల్లో నివాసాల మధ్య, రహదారికి ఆనుకుని ఉన్న పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రహరీలు కూలిపోయి, కంచె లేకుండా ప్రమాదకరంగా మారాయి. అయినా అధికారులు స్పందించపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రహరీలు కూలడంతో చెత్తాచెదారం వేస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దంపింగ్ యార్డులను తలపిస్తూ..

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ అధ్వానంగా మారింది. ఒకసారి బిగించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. అల్లిపురంలోని పలు ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకపోగా, మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు చెత్త డంపింగ్ యార్డులుగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉన్న విద్యుత్ కేబుల్స్ సైతం గాలిలో వేలాడుతూ.. ప్రమాదాలకు సంకేతాలుగా మారాయి. రక్షణ గోడలు విరిగిపోవటంతో స్థానికులు, అక్కడి వ్యాపారులు వాటి వద్ద చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు.

మూతలు లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు..

మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్ బాక్సులు ఏర్పాటు చేశారు. అవి కూడా నిర్వహణ లోపంతో ప్రమాదకరంగా మారాయి. వాటి మూతలు తెరుచుకుని ఉంటున్నాయి. పలుమార్లు వాటిలో జంతువులు మూతులు పెట్టి ప్రమాదాల బారిన పడుతున్నాయి. రోడ్డు పక్కనే, చిన్నపిల్లలకు సైతం అందుబాటులో ఫ్యూజ్ బాక్సులు ఉండి, కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు కానవస్తున్నాయి. కొబ్బరితోట ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ కంచెపై స్థానికులు బట్టలు ఆరబెట్టుకుంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

భద్రత కరువు..

నిబంధనల ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్ల భద్రత, ప్రజలకు ఎలాంటి హాని జరగకుండా రక్షణ కోసం ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్న అధికారులు వాటి నిర్వహణ బాధ్యతను పూర్తిగా గాలికి వదిలేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే ఆయిల్ మార్చకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. వేసవి కాలం కావటంతో మరింత జాగ్రత్త పడాల్సి ఉంది. అధికారులు స్పందించి కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు నిర్మించాలని, జీవీఎంసీ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త, డెబ్రిస్ తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



డీఆర్‌ఎం ఆఫీస్ రోడ్డులో రక్షణ గోడ ధ్వంసమై డంపింగ్ యార్డుగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలు



కొబ్బరితోట వద్ద..

ప్రమాదకరంగా మారాయి

కొబ్బరితోటలో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవటం వల్ల ప్రమాదకరంగా మారాయి. రోడ్డు పక్కగాను, జనావాసాల మధ్య అవి ఉండటం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో అని ఆందోళనగా ఉంది. అధికారులు చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలి.

– పి.అప్పన్న, కొబ్బరితోట

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త తొలగించాలి..

అచ్చియ్యమ్మపేటలోని స్కూల్ వద్ద ఉన్న ఒక ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో టైర్లు, చెత్త వేస్తున్నారు. అదే విధంగా రామకృష్ణా జంక్షన్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పాత వాహనాలు ఉంచారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు ఎగిసి పడితే అవి తగలబడి ప్రమాదం ఉంది. చెత్త, వాహనాలను తొలగించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలి.

– ఉమ్మిడి నూకరాజు, ఎస్‌వీపీ నగర్

ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తలకు ఎగుమతులపై అవగాహన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళి

అల్లిపురం: ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తలకు వ్యవసాయ ఎగుమతులపై ఆదివారం ఒక హోటల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళి, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయకుమార్, దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఏపీ చాప్టర్ జాతీయ అధ్యక్షుడు పద్మశ్రీ నర్రా రవికుమార్, ఉపాధ్యక్షుడు రాజానాయక్ పాల్గొని ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తల ఎదుగుదలకు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో చాప్టర్ జోనల్ అధ్యక్షుడు రాంజీ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు పోలీసులకు రమ్య అప్పగింత



రమ్యను తమిళనాడు పోలీసులకు అప్పగిస్తున్న ఏయూటీడీ ప్రతినిధి

సీతమ్మధార: బాగా చదవడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రైలెక్కి విశాఖ వచ్చేసిన రమ్య (18)కి ఏయూటీడీ–జీవీఎంసీ మహిళా వసతి గృహంలో ఆశ్రయం కల్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడులోని తూతుకూడి జిల్లా, కలుగుమలై టౌన్‌కు చెందిన రమ్య తల్లిదండ్రులు మురుగు లక్ష్మి, చిన్నాదురై ఫిర్యాదు మేరకు అక్కడి పోలీస్ స్టేషన్‌లో రమ్య మిస్సింగ్‌కు సంబంధించి ఫిర్యాదు నమోదయింది. దీంతో హెడ్ కానిస్టేబుల్ నాగరాజన్, మహిళా కానిస్టేబుల్ మహేశ్వరి వైజాగ్ షెల్టర్ హోంకి వచ్చారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు ఆదేశాల మేరకు రమ్యను జీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ సమక్షంలో తమిళనాడు పోలీసులకు క్షేమంగా అప్పగించారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ సునీత తదితరులు

మహారాణిపేట: దేశ స్వాతంత్ర్య సాధన కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా కేజీహెచ్‌లో ఆదివారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ డాక్టర్ సునీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు డాక్టర్ సునీత, డీవైఎఫ్‌ఐ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన డీవైఎఫ్‌ఐ యువజన సంఘం ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. రక్తదానం వల్ల ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.ఎస్.ఎన్. రాజు, కె.సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రావణ్, గణేష్, నాయకులు అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కోర్టులు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఆచార్య సత్యనారాయణ

అల్లిపురం: మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993, సెక్షన్ 30 ప్రకారం ప్రతి జిల్లాలో మానవ హక్కుల కోర్టులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. అలా జరగడం లేదని మానవ హక్కుల కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు ఆచార్య వై.వై.సత్యనారాయణ అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో దామోదర్ సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం మానవ హక్కుల కోర్టుల ఏర్పాటుపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమ్మతితో ప్రతి జిల్లాలో ఒక సెషన్సు కోర్టును మానవ హక్కుల న్యాయస్థానంగా ఏర్పాటు చేసినా బాధితులకు సత్వర న్యాయం లభించడం లేదన్నారు. కాకినాడ జిల్లా మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు హబీబ్ బాషా, గుండు అప్పలరాజు, వీఎస్ఎన్ మూర్తి, నక్కాని అప్పారావు, పలువురు మాజీ పోలీసు అధికారులు, న్యాయవాదులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి దోహదం.. ఆధ్యాత్మిక మార్గం

మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు



అనంత వేంకటేశ్వరస్వామి చిత్రపటాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ గంగరాజు తదితరులు

అల్లిపురం: ప్రపంచ శాంతికి, మానవాళి శాంతి జీవనానికి ఆధ్యాత్మిక, సనాతన ధర్మం ఉపకరిస్తుందని మాజీ పార్లమెంట్ సభ్యుడు గోకరాజు గంగరాజు అన్నారు. వైకుంఠగిరి శ్రీ అనంత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా హోటల్ గ్రీన్‌పార్కులో ఆలయ ధర్మకర్త కర్రి సముద్రారెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వామివారి చిత్రపటాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు ఆధ్యాత్మికత ఎంతో దోహదపడుతుందన్నారు. ఆలయ ధర్మకర్త కర్రి సముద్రారెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.10 కోట్ల వ్యయంతో 2 సంవత్సరాలు శ్రమించి వైకుంఠగిరి శ్రీ అనంత వేంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్మించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు స్వామివారిని దర్శించుకుని ఆధ్యాత్మిక అనుభూతి పొందాలని కోరారు. కార్యక్రమంలో విద్యా కౌన్సిల్ మాజీ సభ్యులు జీఏ నారాయణరావు, గోన సీతారామస్వామి, విజయ శ్రీధర్, మంత్రి శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీకి వీల్ చైర్ల వితరణ



వీల్ చైర్లు అందజేస్తున్న వింటేజ్ విశాఖ అధ్యక్షురాలు హైమావతి

సీతంపేట: వింటేజ్ విశాఖ కార్యవర్గ సమావేశం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం జరిగింది. సంస్థ అధ్యక్షురాలు ఎ.హైమావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంస్థ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా సంస్థ తరఫున జీవీఎంసీ స్పందన కార్యక్రమానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగుల కోసం రెండు వీల్ చైర్లు జీవీఎంసీ డీసీపీ టి.జి.రామ్మోహన్‌రావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జి.మోహన్‌కృష్ణ, సురేష్ ఖన్నా, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎల్ శాస్త్రికి ఘన నివాళి



ఐవీఎల్ శాస్త్రి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అతిథులు

మహారాణిపేట: సంగీత జనకులం వ్యవస్థాపకులు, దివంగత ఐవీఎల్ శాస్త్రి 98వ జయంతి సందర్భంగా డాబాగార్డెన్స్ వద్ద గల ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయంలో ఆదివారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శాస్త్రి ప్రియ శిష్యులు, సంగీత విద్వాంసులు ఆకొండి వెంకటరావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముందుగా శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ సభికులను ఉద్దేశించి మాట్లాడారు. వేలాది మందికి ఉచితంగా శాస్త్రీయ సంగీతం నేర్పించిన ఘనత ఒక్క ఐవీఎల్ శాస్త్రికే దక్కుతుందన్నారు. ఆయనకు నివాళిగా శిష్య బృందం సామూహికంగా సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి సంస్థ ప్రతినిధులు ఎ. వెంకటరావు, కె. సుబ్రహ్మణ్యం, పి. జగన్‌మోహనరావు, వి. మధుసూదనరావు, గణేష్, మధుబాబు, మహేశ్వరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో కళాకారుల పాత్ర కీలకం



కళాకారులతో అతిథులు, నిర్వాహకులు

తాటిచెట్లపాలెం: దేశాభివృద్ధి, సమాజాభివృద్ధిలో కూడా కళాకారులది సుస్థిర స్థానమని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రతబాగ్చి తెలిపారు. ఆదివారం రైల్వే న్యూకాలనీలో గల సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కళాప్రవీణ 2025 ఉగాది పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు అనేక రూపాల్లో ప్రజలకు వినోదం కలిగించడంతో పాటు ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై కూడా అవగాహన కల్పిస్తున్నారన్నారు. అలాంటి కళాకారులను సత్కరించడం సంతోషించదగిన విషయమన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పలువురు కళాకారులకు ప్రతి ఏటా ఉగాది పర్వదినాన అవార్డులు ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. 16 మంది కళాకారులను ఘనంగా సత్కరించారు. ఉపకార్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కంచర్ల అమృతరావు, కళాకారుల సంఘం అధ్యక్షుడు కె. జనార్దన్, గౌరవ సలహాదారు ఆర్. నాగరాజ్ పట్నాయక్, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బి.కె. రామేశ్వరి, యాదగుమార్, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేద్దాం.. మూడు ప్రాణాలు కాపాడుదాం



రక్తదానం చేస్తున్న ఫెడరేషన్ సభ్యులు

అల్లిపురం: రక్తదానం చేద్దాం.. మూడు ప్రాణాలు కాపాడుదాం అని ఆల్ ఇండియా ఎక్స్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కాంతారావు, ప్రవీణ్‌శర్మ, సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. టూటౌన్ దరి ప్రేమసమాజం ఆడిటోరియంలో ఆదివారం ఉదయం జరిగిన ఫెడరేషన్ పదవ వార్షికోత్సవంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రక్త నమూనాల కొరత అధికంగా ఉందని, దాన్ని అధిగమించేందుకు ఆలిండియా ఎక్స్ సర్వీస్‌మెన్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కృషి చేస్తుందన్నారు. ఫెడరేషన్ పిలుపు మేరకు 150 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం శుభదాయకమన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత.. అదెక్కడ?





స్వచ్ఛభారత్.. స్వచ్ఛాంధ్రప్రదేశ్ నినాదంతో ప్రభుత్వాలు ముందుకెళ్తున్నా కొందరు అధికారుల్లో మాత్రం మార్పు రావడంలేదు. దీనికి నిదర్శనమే నీలమ్మ వేప చెట్టు ఆలయం వద్ద దర్శనం ఇస్తున్న ఈ చెత్త. – ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నిర్భీతిగా నిబంధనల ఉల్లంఘన..



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్మించిన అండర్ పాత్ వే ప్రమాదాలకు నిలయంగా మారడంతో కొంత కాలం పాటు దీనిని వన్‌వేగా మార్చారు. ఇటీవల ఈ దారిలో రాకపోకలకు అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ తన ద్విచక్ర వాహనాన్ని అక్కడ నిలుపుదల చేశారు. అదే రహదారిలో ద్విచక్ర వాహన చోదకుడు హెల్మెట్ లేకుండా సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ రావడం గమనార్హం.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పోర్టు ఆస్పత్రిని కాపాడుకుందాం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 174వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షను సీఐటీయూ పోర్టు యూనియన్ కార్యదర్శి కె. సత్యనారాయణ ప్రారంభించారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో పోర్టు ఆస్పత్రిని కాపాడుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో త్రినాథరావు, సీహెచ్ నాయుడు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.